సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం । 19 । జనవరి । 2023



రంగాపూర్ ఉర్సు..
మత సామరస్యానికి ప్రతీకైన రంగాపూర్ ఉర్సు ఘనంగా ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



పొంచి ఉన్న ప్రమాదం
రోడ్లపై ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాడం ఆడుతున్నారు.

వివరాలు 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.4 /17.8
ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాలను వినియోగించుకోండి



అయిజ: ఎస్సీ కార్పొరేషన్, దళితబంధు పథకాల ద్వారా పొందిన వాహనాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్, దళితబంధు ద్వారా మంజూరైన వాహనాలను లబ్ధిదారులు వినియోగిస్తున్నారా.. లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వాహనాలను దుర్వినియోగం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: నూతనంగా బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ కోసం నమోదు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్వేతా ప్రియదర్శిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన స్కూల్స్ సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 29లోగా జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహం

గద్వాల రూరల్: జిల్లాలో ఆయిల్‌పాం తోటలను సాగుచేసే రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సబ్సిడీలు అందజేసి ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం ఆమె కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022– 23 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 4,690 ఎకరాలకు ఆయిల్‌పాం మంజూరు అయిందన్నారు. ఇందులో ఇప్పటికే 2,367ఎకరాల్లో పంటను సాగు చేశారని ఇంకా మిగిలిన మొత్తం ఎకరాల్లో పంటను సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి మొత్తం విస్తీర్ణంలో పంటలు సాగుచేసేలా లక్ష్యం సాధించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అక్బర్, జిల్లా వ్యవసాయాధికారి గోవిందునాయక్, ఏడీలు సక్రియానాయక్, సంగీతలక్ష్మి, మండల విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

ఉండవెల్లి: ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేశారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బోయ మునిస్వామికి గద్వాలకు చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి 2019 నుంచి పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆర్టీసీలో సూపర్‌వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని ఇర్ఫాన్ నమ్మించడంతో మునిస్వామి విడతల వారీగా 2021 వరకు రూ.1.85 లక్షలు అందించాడు. అయితే చాలారోజులు ఆగినా ఉద్యోగం ఇప్పించకపోవడంతో నిలదీయగా.. ఆర్టీసీలో లేవని, రైల్వేలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం ఖాళీగా ఉందని నమ్మించి వెళ్లిపోయాడు. అది కూడా ఇప్పించకపోవడంతో మోసపోయానని గుర్తించి బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

ఎర్రవల్లి చౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వావిలాలలో శివాంజనేయస్వామి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంతర్రాష్ట్ర సీనియర్ విభాగం బండలాగుడు పోటీలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వృషభాలు సీనియర్ విభాగం పోటీల్లో పాల్గొని బండను లాగి సత్తాచాటాయి. ఈ సందర్భంగా మొదటి బహుమతి రూ.60 వేలు హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి, రెండో బహుమతి రూ.50 వేలు గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులు, మూడో బహుమతి రూ.40 వేలు డోన్ కొత్తకోటకు చెందిన గుర్నాథ్, నాలుగో బహుమతి రూ.30 వేలు డోన్ కొత్తకోటకు చెందిన రాంమోహన్, ఐదో బహుమతి రూ.20 వేలు అనంతపూర్‌కు చెందిన రామసుబ్బారెడ్డి, ఆరో బహుమతి రూ.10 వేలను గార్లదిన్నెకు చెందిన నాగేశ్వరరెడ్డి వృషభాలు కైవసం చేసుకున్నాయి. పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన వృషభరాజాల యజమానులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి నగదు బహుమతులను ప్రదానం చేశారు.



నమోదు అంతంతే

'ఈ–శ్రమ్'పై కార్మికులకు అవగాహన కరువు



ఈ–శ్రమ్‌పై పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)

- అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు
- రూ.2లక్షల వరకు ప్రమాద బీమా.. మరెన్నో ప్రయోజనాలు
- అవగాహన కల్పించని కార్మికశాఖ అధికారులు
- జిల్లాలో 2.16 లక్షల మందికి 95 వేల మంది నమోదు



గద్వాల అర్బన్: అసంఘటిత రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర, కార్మిక, ఉపాధి శాఖ 'ఈ –శ్రమ్' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో కార్మికులకు సంక్షేమం కోసం వివిధ సామాజిక భద్రత పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి రూ.2 లక్షల జీవిత బీమా కల్పిస్తోంది. ప్రమాదవశాత్తు అంగవైకల్యం చెందిన రూ.లక్ష బీమాను అందజేస్తారు. కాగా జిల్లావ్యాప్తంగా 2,16,500 మంది కార్మికులు ఉండగా 96,500 మంది మాత్రమే తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అయితే ఈ శ్రమ్ పథకంపై కార్మిక శాఖ అధికారులు ఆవగాహన కల్పించడం లేదు. దీంతో కార్మికులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులతో నిర్వహించిన సమావేశంలో దీనిపై క్షేత్రస్థాయిలో ప్రచారం చేసి ఎక్కువ మంది కార్మికులు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఈ శ్రమ్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

అర్హులు వీరే..
ఈ పథకంలో చేరదల్చుకున్న కార్మికులు అసంఘటిత రంగంలో తప్పనిసరిగా పనిచేస్తుండాలి. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం లేనివారు, వ్యవసాయ కూలీలు, దాని అనుబంధ రంగాల్లో పనిచేసేవారు, చిన్న, సన్నకారు రైతులు, కూలీలు, వీధి వ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే గుమస్తాలు అర్హులు. వీరితోపాటు తోపుడు బండ్ల వారు, వడ్రంగులు, ఎలక్ట్రీషన్లు, ఇటుక బట్టీలు, ఉపాధి కూలీలు, ఆశ, అంగన్‌వాడీ ఆయాలు, రిక్షావాలాలు, ఆటో డ్రైవర్లు, కూరగాయల వ్యాపారులు, పండ్ల విక్రేతలు, మధ్యాహ్న భోజన వర్కర్లతోపాటు ఇతర రంగాల్లో పని చేసే దినసరి కూలీలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని కార్డు పొందవచ్చు. ఈ కార్డు పొందాలంటే రేషన్, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, ఫోన్ నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న కార్మికుడికి ప్రమాద బీమా రూపంలో నేరుగా ఖాతాల్లో జమ చేస్తోంది.

లక్ష్యంపై నీలినీడలు
కార్మికశాఖ అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందేలా చొరవ చూపాలని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా అధికారులు పని చేయడం లేదు. జిల్లాలో 2,16,500 మంది లక్ష్యంగా ఉంది. అయితే ఇప్పటి వరకు 96,500 మంది కార్మికులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 1.20 లక్షల మంది కార్మికులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. దీనిని బట్టి చూస్తే ఇప్పటి వరకు లక్ష్యంలో సగం కూడా నమోదు కాకపోవడంతో కార్మికశాఖ అధికారుల పనితీరు ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుందని కార్మిక సంఘాలు వాపోతున్నారు. అయితే వీటిపై కార్మికులకు అవగాహన కల్పించకపోవడంతో వారు దరఖాస్తుకు నోచుకోవడం లేదని తెలుస్తోంది. కార్మికశాఖ అధికారులు వీటిపై అవగాహన సదస్సు నిర్వహించి కార్మికులకు ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలను అవగాహన కల్పిస్తే చాలామంది లబ్ధిపొందే అవకాశం ఉంది. కానీ, కార్మికశాఖ అధికారులు మాత్రం కార్యాలయానికి పరిమితమవుతున్నారని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఆయా గ్రామాల్లో ఈ శ్రమ్‌తో కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, అప్పుడే లక్ష్యం చేరతారని పలువురు పేర్కొంటున్నారు.

నమోదు చేసుకోవాలి..
అసంఘటిత కార్మికులందరు కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అర్హత పొందడానికి ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఈపీఎఫ్, ఈఎస్‌ఐ లేని వారందరు ఈ పథకానికి అర్హులు. జిల్లాలో 2,16,500 మంది కార్మికుల నమోదు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 96,500 మందిని పోర్టల్‌లో నమోదు చేశాం. విస్తృత అవగాహన కల్పించి లక్ష్యాన్ని చేరుకుంటాం.
– మహేష్‌కుమార్, కార్మికశాఖ అధికారి

రహదారులపై నిఘా కట్టుదిట్టం



మాట్లాడుతున్న ఎస్పీ రంజన్ రతన్‌కుమార్

ఎస్పీ రంజన్ రంతన్‌కుమార్ ఆదేశం

గద్వాల క్రైం: జాతీయ రహదారులపై నిఘా, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్రాష్ట్ర నేరస్థులు దారిదోపిడీలకు వ్యూహం రచిస్తూ విలువైన సామగ్రి, నగదు, వాహనాలను అపహరించేందుకు రహదారులపై కాపు కాస్తున్నారన్నారు. ఇలాంటివి నిలువరించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బాధితుల ఫిర్యాదులపై సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. హింసాత్మక ఘటనలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో ముందుకు వెళ్లాలన్నారు. పెండింగ్ కేసుల విచారణలో జాప్యం లేకుండా వేగవంతంగా విచారణ చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. సరిహద్దు ప్రాంతాల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం, గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు, బియ్యం, ఇసుక అక్రమ రవాణా జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. మహిళలపై దాడులు, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డయల్ 100 కాల్స్ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ఘటనా స్థలం వద్దకు క్షణాల్లో చేరుకోవాలని, పెట్రోలింగ్, గస్తీ ముమ్మరం చేయాలని కోరారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందస్తు వ్యూహంతో కట్టడికి కృషి చేయలన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రంగస్వామి, సీఐలు చంద్రశేఖర్, సూర్యనాయక్, శివశంకర్‌గౌడ్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును విజయవంతం చేయాలి

మల్దకల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని నీలిపల్లి, మల్దకల్ గ్రామాల్లోని కంటివెలుగు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చినట్లు చెప్పారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చే వారికి ముందస్తుగా టోకెన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం మల్దకల్ రైతువేదికలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, డాక్టర్ స్వరూపరాణి, సర్పంచ్ యాకోబు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి

ఉత్కంఠగా క్రికెట్ పోటీలు



ఉత్తరప్రదేశ్- ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్

సత్తాచాటిన బంగ్లాదేశ్, కశ్మీర్, ఢిల్లీ జట్లు

గద్వాల: నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సేవా డేస్ సహకారంతో సాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. నాలుగు రోజులుగా ప్రైమ్ మినిస్టర్ కప్ క్రికెట్ టోర్నీ కొనసాగుతుంది. బుధవారం మొదటి మ్యాచ్‌లో శ్రీలంక, కాశ్మీర్ జట్లు తలపడగా, కశ్మీర్ జట్టు విజయం సాధించింది. నిర్ణీత 15 ఓవర్లలో శ్రీలంక జట్టు 130 పరుగులు చేసి ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కశ్మీర్ జట్టు 14 ఓవర్లలో విజయ లక్ష్యాన్ని పూర్తి చేసి గెలుపొందింది. 62 పరుగులు చేసిన ఉమ్మద్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. రెండో మ్యాచ్‌లో ఆంధ్ర, బంగ్లాదేశ్ జట్లు తలపడగా బంగ్లాదేశ్ బౌలర్ల దాటికి ఆంధ్ర జట్టు విలవిలాడింది. 8 వికెట్లను కోల్పోయి కేవలం 82 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు రెండు వికెట్లను కోల్పోయి సునాయసంగా విజయం సాధించింది. ఆల్‌రౌండర్ ప్రతిభ కనభర్చిన జెక్రిల్ జెమ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. పంజాబ్ – గద్వాల వీరాహనుమాన్ జట్లు మూడో మ్యాచ్ హోరాహోరిగా సాగింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. బరిలోకి దిగిన గద్వాల వీరాహనుమాన్ జట్టు 14 ఓవర్లలో విజయ లక్ష్యాన్ని ఛేదించింది. ప్రతిభ చాటిన రఘుకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది. నాల్గవ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్- ఢిల్లీ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఉత్తరప్రదేశ్ జట్టు 120 పరుగులు చేసింది. అనంతరం బరిలో దిగిన ఢిల్లీ జట్టు సునాయసంగా విజయం సాధించింది. 24 బంతులలో 64 పరుగులు చేసిన ఢిల్లీ జట్టు క్రీడాకారుడు భరత్‌కు మ్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.



రథాన్ని లాగుతున్న వేలాది మంది భక్తులు (ఇన్‌సెట్‌లో) స్వామివారి ఉత్సవ విగ్రహం

నమో.. నారసింహా

- సింగోటంలో రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- లక్ష్మీనర్సింహస్వామి నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

– కొల్లాపూర్

వివరాలు 8లో ▸

నత్తనడకన నాగర్‌దొడ్డి



అసంపూర్తిగా 106 ప్యాకేజీ కాల్వ

- 2006లో రిజర్వాయర్ పనులు ప్రారంభం
- 16 ఏళ్లుగా సా..గుతున్న కాల్వ నిర్మాణం
- ఆయకట్టుకు నీరందక రైతుల అవస్థలు



డీజిల్ ఇంజిన్లతో నీరు పారించుకుంటున్న రైతులు

అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి 16 సంవత్సరాలు గడుస్తున్నా నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఆయకట్టు పంట పొలాలకు సాగునీరందని దుస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, నిధుల కొరతతో ప్రాజెక్ట్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా రిజర్వాయర్‌లోని 106 ప్యాకేజీ కాల్వ పనులు నిలిచిపోయాయి.

రూ.22 కోట్లు మంజూరు..
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కృషితో 2006 సంవత్సరంలో నెట్టెంపాడు ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనుల్లో భాగంగా 108 ప్యాకేజీ కింద మల్దకల్ మండలంలో నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. వాటి ద్వారా అయిజ మండలంలోని పంట పొలాలకు సాగునీరందించాలనేది ప్రధాన ఉద్దేశం. నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 22 కోట్లు మంజూరు చేశారు. 0.7 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ రిజర్వాయర్‌లో నాగర్‌దొడ్డి పరిధిలో 1,380 ఎకరాల భూములు ముంపునకు గురయ్యాయి. దీంతో బాధిత రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం కింద సుమారు రూ.15 కోట్లు చెల్లించింది. అయిజ మండలంలోని 6 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రణాళిక రూపొందించారు. రిజర్వాయర్ పనులు 92 శాతం పూర్తవగా.. ఆయకట్టు కాల్వ పనులు మాత్రం పూర్తికాలేదు.

ఇబ్బందులు పడుతున్నాం..



నాగర్‌దొడ్డి రిజర్వాయర్ పనులు నత్తన డకన సాగుతున్నాయి. కాల్వ పనులు పూర్తి కాకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. డీజిల్ ఇంజిన్లతో నీరు పారించుకునాలంటే వ్యవప్రయాసాలతో కూడినపని. పగటిపూట నీరు పారకపోవడంతో రైతులు రాత్రి సమయంలో నీళ్ల పారించుకుంటున్నారు. కాల్వ పనులు వెంటనే పూర్తిచేసి ఆదుకోవాలి.
– గోవిందు, రైతు, అయిజ

సొంతంగా తవ్వారు..



నాగర్‌దొడ్డి రిజర్వాయర్ కాల్వ పనులు పూర్తికాకపోవడంతో రైతులు సొంతంగా ఏర్పాటుచేసుకొని పంటలకు నీరు పారించకుంటున్నారు. ఇలా కొంతమంది రైతులకే ఉపయోగంగా ఉంది. కాల్వలకు దూరంగా ఉన్న వారికి అలాంటి అవకాశం కూడా లేకుండా పోయింది. పిల్ల కాల్వలు ఏర్పాటు చేస్తేనే అందరు రైతులకు ఉపయోగంగా ఉంటుంది.
– నారాయణరెడ్డి, రైతు, ఉప్పల

భూసేకరణ పూర్తికాలేదు..
నాగర్‌దొడ్డి రిజర్వాయర్ కాల్వ పనులు చేపట్టేందుకు అనేక ఆటంకాలు ఏర్పడ్డాయి. 106 ప్యాకేజీలో భూ సేకరణ ఆలస్యమవుతుంది. ఇప్పటివరకు భూసేకరఫ పూర్తయిన పొలాల్లో కాల్వలు తవ్వాం. త్వరలోనే కాల్వ నిర్మాణం పనులు పూర్తిచేసి సాగునీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరావు,నెట్టెంపాడు ప్రాజెక్ట్ ఎస్ఈ

సాగునీరు.. వాగుపాలు
జూరాల మిగులు జలాలు వృథాపోకుండా నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా రైతుల పంట పొలాలకు నీరందించాలని రిజర్వాయర్లను నిర్మిస్తే కాల్వల పనులు పూర్తికావడం లేదు. దీంతో నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌లో నీరు ఆయకట్టు భూములకు అందకుండా వాగుల నుంచి వృథాగా పోతుంది. కాల్వ పనులు పూర్తికాకపోవడంతో రైతులు వారి పంటలకు నీరు పారించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. రైతులు సొంత ఖర్చులతో యంత్రాలతో తాత్కాలికంగా కాల్వలు నిర్మించుకొని డీజిల్ ఇంజిన్లతో పైపుల ద్వారా పంటపొలాలకు సాగునీరు పారించుకుంటున్నారు. వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో నాగర్‌దొడ్డి రిజర్వాయర్ నీరు పంటపొలాలకు అవసరం లేకుండా పోయింది. అయితే యాసంగి సాగుకు డీజిల్ ఇంజిన్ల ద్వారా సాగునీరు తరలిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో ఎకరాకు సుమారు రూ.5–10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వ పనులు పూర్తిచేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అచ్చంపేట రూరల్: ద్విచక్ర వాహనాన్ని జీపు బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి అచ్చంపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ కథనం మేరకు.. పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన ఎడ్ల తిరుపతయ్య (46) తన కుమార్తెను ద్విచక్ర వాహనంపై బల్మూర్‌లో దించి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో అచ్చంపేట నుంచి లింగాల వైపు వెళ్తున్న జీపు పట్టణ శివారులో ఢీకొనడంతో తిరుపతయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సాయిలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



చెన్నయ్య (ఫైల్)

అచ్చంపేట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని సిద్దాపూర్ శివారులో చోటు చేసుకుంది. సిద్దాపూర్ ఎస్ఐ గురుస్వామి తెలిపిన వివరాల ప్రకారం... సిద్దాపూర్‌కు చెందిన అలెమోని చెన్నయ్య(45) తన వ్యవసాయ పొలానికి బైక్‌పై రాత్రి వేళ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. చెన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలం బాజీపూర్‌లో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ షంషోద్దీన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన చెన్నమోని ఆనంద్ (40) కొద్దికాలంగా అప్పులతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. పొలం నుంచి వచ్చిన భార్య గుర్తించి వెంటనే స్థానికుల సాయంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి అటునుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందింది. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు. ఆనంద్‌కు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవాబుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన కావటి ఆంజనేయులు (56) ఈ నెల 15న కుటుంబ కలహాలతో పొలం వద్ద పురుగు మందు తాగాడు. కుమారుడు రమేష్ పొలం దగ్గరకు వెళ్లగా కింద పడి ఉన్న ఆంజనేయులును గమనించి పురుగు మందు వాసన రావటంతో జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

వ్యక్తిగత కారణాలతో..



భరత్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ చెందిన భరత్ (25) జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో హోటల్ ఆవరణలో ఉరివేసుకుని అనుమానాస్పదంగా మృతిచెందాడు. గమనించిన హోటల్ యజమాని పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం



చంద్రయ్య (ఫైల్)

గోపాల్‌పేట: కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని బుద్దారంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నవీద్ తెలిపిన వివరాల మేరకు.. తూడుకుర్తి చెందిన కొప్పునూరు చంద్రయ్య (38) బుద్దారం చెందిన జయమ్మతో వివాహమైంది. 10ఏళ్ల నుంచి బుద్దారంలోనే వ్యవసాయం చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. కొంత కాలంగా ఇంట్లో గొడవలు అవుతుండడంతో మనస్తాపం చెందిన చంద్రయ్య మంగళవారం రాత్రి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అంతటా.. నమో నారసింహా

సింగోటం రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

- లక్ష్మీనర్సింహా స్వామివారి నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారి రథోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఓరుగంటి సంపత్‌కుమార్‌శర్మ పర్యవేక్షణలో వేదపండితులు ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలతో అందంగా అలంకరించి వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తేరుపైకి తీసుకొచ్చారు. ఆలయ ట్రస్టీ రాజా బాలాదిత్య లక్ష్మణరావు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి లాంఛనంగా పూజలు చేసి తేరును ముందుకు లాగారు. చెంచులు తమ ఆచారం ప్రకారం స్వామివారికి లాంఛనాలు సమర్పించారు. భక్తుల భజనలు, కళాకారుల కోలాటాలు ఉత్సవాల్లో ప్రత్యేక అలంకరణగా నిలిచాయి. భక్తులు తేరును ప్రధాన ఆలయం నుంచి రత్నగిరి కొండ వరకు లాగి శమీవృక్షం చుట్టూ తిప్పి తిరిగి ప్రధాన ఆలయం వరకు తీసుకొచ్చారు. తేరును లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. రథోత్సవానికి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు హైదరాబాద్, రాయలసీమ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.



రథోత్సవానికి హాజరైన భక్తులు

ప్రముఖుల ప్రత్యేక పూజలు..

మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ నేతలు చింతలపల్లి జగదీశ్వర్‌రావు, అభిలాష్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, వివిధ పార్టీల నాయకులు రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న అర్చకులు



రథోత్సవంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



రథానికి మొక్కుతున్న తండ్రీ కొడుకులు

రథాన్ని లాగుతున్న భక్తజనం



దర్శనానికి బారులు తీరిన భక్తులు

భారీ బందోబస్తు..

రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. జాతర ప్రాంతానికి దూరంగా వాహనాలను నిలిపివేశారు. భక్తులు ఆలయానికి చేరుకునేందుకు ఇబ్బందులు పడకుండా ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేకంగా ఆటో సౌకర్యం కల్పించారు.

విద్యుత్ వైర్లు తగిలి కూలీకి తీవ్ర గాయాలు

కోస్గి: కొత్తగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం పనుల కోసం వచ్చిన ఓ కూలీ విద్యుత్ వైర్లు తగిలి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మద్దూర్ మండలం జాజారావుపల్లికి చెందిన నీల్యా నాయక్ రోజువారి అడ్డకూలీగా పట్టణానికి వచ్చి పనులు చేసుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం కూలీ పనులకు వచ్చిన నీల్యా నాయక్‌ను కాంట్రాక్టర్ బస్టాండ్ పనుల నిమిత్తం తీసుకెళ్లాడు. మరుగుదొడ్ల పైకప్పు స్లాబ్ వేస్తున్న క్రమంలో పై నుంచి వెళ్లిన 11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కింద పడ్డాడు. కాలిన గాయాలతో ఉన్న అతన్ని తోటి కూలీలు స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ వైర్లు ఉన్నప్పటికి విద్యుత్ సరఫరా ఉందని చెప్పినప్పటికి పట్టించుకోకుండా పనులు చేయించిన కాంట్రాక్టర్‌తో తోటి కూలీలు వాగ్వివాదానికి దిగారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'ఆలన' వాహనంలో మృతదేహం తరలింపు

- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రోగుల డిమాండ్



జనరల్ ఆస్పత్రి వద్ద ఆలన వాహనం నుంచి మృతదేహాన్ని దించుతున్న సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: అచేతన స్థితిలో ఉన్న క్యాన్సర్ పేషంట్లతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య సేవలు అందించేందుకు ఉపయోగించే ఆలన వాహనాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకోవడంతో రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో సేవలు అందించేందుకు వినియోగించే ఆలన వాహనాన్ని బుధవారం ఉదయం మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. జిల్లా కేంద్రంలో ఉరివేసుకొని చనిపోయిన యువకుడి మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించేందుకు వినియోగించడంతో రోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని తరలించడం వల్ల క్యాన్సర్ పేషంట్లతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడిన వారికి ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహం తరలింపుపై సంబంధిత అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రఘును వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మట్టి కన్పిస్తే దస్తి వేసిండ్రు

మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



బిజినేపల్లి: నియోజకవర్గంలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులు నల్లమట్టి కన్పించిన చోటల్లా దస్తి వేసి దోచుకున్నారని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తిమ్మాజీపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం అనంతరం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చెరువుల్లో నల్లమట్టిని 2 ఫీట్లు తవ్వాల్సి ఉండగ, కాసులకు కక్కుర్తిపడి బీఆర్ఎస్ నాయకులు 12 ఫీట్ల వరకు తవ్వించి అమ్ముకున్నారన్నారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి దళితులంటే చులకన భావం ఉందని, తన తర్వాత లక్ష్యం నేరాళ్లపల్లియేనని, ఆ గ్రామంలో ఎమ్మెల్యే చేత అంటరానితనానికి గురైన దళితులకు అండగా ఉంటానన్నారు. బిజినేపల్లి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే మర్రి ఒక దళితున్ని బహిరంగంగా బెదిరించిన వీడియోను ప్రదర్శించారు. శాయిన్‌పల్లిలో గిరిజన నాయకుడు వాల్యపై బీఆర్ఎస్ నాయకులు కర్కశత్వంగా దాడులు చేశారని, ఆ దాడుల వెనుక ఎమ్మెల్యే హస్తం ప్రత్యక్షంగా కన్పిస్తుందన్నారు. ఈ నెల 22వ తేదీన నిర్వహించబోయే దళిత గిరిజన ఆత్మగౌరవ సభకు ఉమ్మడి జిల్లా నుంచి దళిత గిరిజనులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి కూడా తప్పకుండా హాజరు కావాలని కోరారు.

న్యాయం కోసం కుటుంబం పోరాటం

- రెండ్రోజులపాటు అంత్యక్రియలు నిర్వహించకుండా నిరసన



మల్లయ్య (ఫైల్)

బిజినేపల్లి: తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతిచెందిన వ్యక్తికి రెండురోజులపాటు అంత్యక్రియలు నిర్వహించకుండా నిరసన తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తిమ్మాజీపేట మండలం గొరిటకు చెందిన ఎక్కె మల్లయ్య(45) ఎకరా భూమి ఉండగా.. దానిని గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ఒకరు అమ్మాలని సూచించాడు. దీనికి మల్లయ్య నిరాకరించడంతో అతని తోబుట్టువులతో కలిసి ఇబ్బందులకు గురి చేశాడు. ఈ క్రమంలోనే సొంత చెల్లెలే తనను అత్యాచారం చేయబోయాడని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లయ్య ఈ నెల 13న పొలం వద్ద పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 16న మృతిచెందాడు. ఈ ఘటనపై మల్లయ్య భార్య అదేరోజు తిమ్మాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులైన చిట్టెమ్మ, వెంకటయ్య, సూరమ్మ, బాలయ్య, శివకుమార్, శ్రీశైలం, కర్రెమ్మ, పుల్లయ్యలపై కేసు నమోదైంది. కాగా.. గొరిటకు చెందిన ఒక ప్రజాప్రతినిధి తమ కుటుంబ సభ్యుల ద్వారా తన భర్తను వేధించడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని భార్య బాలమ్మ, కూతురు ఆరోపిస్తూ మల్లయ్యకు రెండు రోజులుగా అంత్యక్రియలు నిర్వహించలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ శంషుద్దీన్ బుధవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ మల్లయ్య ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో బుధవారం సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ నిందితులకు తప్పకుండా శిక్ష పడేలా చూస్తామన్నారు.



రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ షేక్ శంషుద్దీన్

రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన టెంపో ట్రావెల్స్ బస్సు తిరుపతి వెళ్తోంది. మార్గమధ్యలో మూసాపేట శివారులో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న డీసీఎంను టెంపో ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న భాగ్య, మల్లారెడ్డి, స్వరూప, శ్రీసాయి, గోపాల్‌రెడ్డి, అనురాధ, మాధవి, ధ్రువాన్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రంగాపూర్ ఉర్సులో జనసందోహం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వారంపాటు నిరంజన్‌షావలి ఉత్సవాలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

అచ్చంపేట: మత సామరస్యానికి ప్రతీక అయిన అచ్చంపేట మండలం రంగాపూర్ హాజ్రత్ నిరంజన్‌షావలి ఉర్సు(జాతర) ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గంధోత్సవంతో వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. వేలాదిగా తరలివచ్చిన జనసందోహం మధ్య రంగాపూర్ ఉర్సు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్గాను సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. గంధం వేడుకలు తిలకించేందుకు ముందు రోజే ప్రజలు రంగాపూర్‌కు చేరుకున్నారు. బుధవారం సాయంత్రం వరకు కూడా జన సందోహం ఒకే మాదిరిగా ఉంది. వేలసంఖ్యలో జనం తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచేకాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఈ ఉర్సుకు తరలివచ్చారు. భక్తులు కందూర్లు చేసి దర్గాలో ఫాతేహాలు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఈ ఉత్సవాలు వారం పాటు నిర్వహించనున్నారు. సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో ఎస్ఐ గోవర్ధన్ అక్కడే ఉండి, బందోబస్తు ఏర్పాట్లు చూస్తున్నారు.

ఉమామహేశ్వర క్షేత్ర సందర్శన..

రంగాపూర్ గ్రామానికి 5కిలోమీటర్ల దూరంలో కొండపై వెలిసిన శ్రీ ఉమామహేశ్వర క్షేత్రాన్ని దర్గా దర్శనం అనంతరం భక్తులు సందర్శించడం ఆనవాయితీ. రంగాపూర్ ఉర్సుకు రెండు రోజుల ముందే శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రంగాపూర్ ఉర్సుకు వచ్చిన భక్తులు కుల, మతభేదాలు లేకుండా విధిగా ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. మత సామరస్యం వెల్లివిరిసే ఈ రెండు ఉత్సవాలు ఒకేసారి ముగుస్తాయి. ఉమామహేశ్వర క్షేత్రంలో ముస్లిం మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు.



దర్గా వద్ద క్యూలో నిలిచి ఉన్న భక్తులు



ఉర్సులో జన సందోహం

శేషవాహనంపై ఊరేగిన ఉమామహేశ్వరుడు



శేషవాహనంపై ఊరేగుతున్న ఉమామహేశ్వరుడు

- బ్రహ్మోత్సవాల్లో కొనసాగుతున్న రద్దీ

అచ్చంపేట: నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రం ప్రదోషకాలంలో నిర్వహించిన నందివాహన సేవకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉమామహేశ్వర ఆలయం నుంచి పాపనాశిని గుండం వరకు ఉమాసదులను అశ్వవాహనంలో ఊరేగించారు. వేద పడింతుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో ఉమామహేశ్వర స్వామి సంకీర్తన చేస్తూ భజన బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తుల జయ జయ ధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఉదయం నుంచి ఆలయంలో గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు, రుద్రాభిషేకం, రుద్ర హోమం, దుర్గా సూక్త హోమాలు, మృగ యాత్ర వినోదం, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9గంటలకు గవ్యాంత పూజలు, అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన,(కుంకుమార్చన) రుద్రాభిషేకం, రుద్రహోమం, సాయంత్రం 5గంటలకు సాయమౌపాసన, శ్రీసూక్తి దుర్గా సూక్త హోమాలు, నంది వాహనసేవ, మృగయాత్ర వినోదం, నీరాజన మంత్రపుష్పము, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అచ్చంపేట, రంగాపూర్‌ల నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఉమామహేశ్వర కొండపైకి ఆరు మినీ బస్సులను హైదరాబాద్, కొల్లాపూర్, షాద్‌నగర్, కల్వకుర్తి డిపోల నుంచి రప్పించారు.

పోలీస్ బందోబస్తు..

అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో ఎస్ఐలు గోవర్ధన్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్గా వద్ద స్వయంగా బందోబస్తును పరిశీలిస్తూ ట్రాఫిక్, వాహనాలను మళ్లిస్తున్నారు. దర్గా వద్ద నుంచి గ్రామ పంచాయతీ, ఉమామహేశ్వరం ద్వారం వరకు కాలినడకన భక్తులు తప్ప ఇతర వాహనాలను అనుమతించడం లేదు.



ఉమమహేశ్వర క్షేత్రంలో భక్తుల పూజలు



ఉమామహేశ్వర క్షేత్రం ఆవరణలో..

కొండపైకి ఇతర వాహనాలు నిలిపివేత

ఉమామహేశ్వరం కొండపైకి ఇతర వాహనాలను అనుమతించడం లేదు. కింద భోగమహేశ్వరం ఆంజనేయ స్వామి గుడి వెనుకలో ద్విచక్ర వాహనాలు, పంచాయతీ రాజ్ అతిథిగృహం వద్ద ఇతర వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కొండపైకి వీఐపీ వాహనాలను కూడా అనుమంతిచక పోవడంతో ప్రతి ఒక్కరూ బస్సు ప్రయాణం లేదా మెట్లదారిగుండా కాలినడకన క్షేత్రం చేరుకుంటున్నారు. రంగాపూర్, భోగమహేశ్వరం నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. కొండపైకి వెళ్లే భక్తులు బస్సులో వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు.